క్లుప్తంగా

'బీసీలకు అన్యాయం'

భద్రాచలంటౌన్: తెలంగాణ ప్రభుత్వం వెనుకబడిన, అట్టడుగు వర్గాలను అణగదొక్కుతూ రాష్ట్రంలో 60 శాతం ఉన్న బీసీలకు తీవ్ర అన్యాయ చేస్తోందని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఆకుల నాగేశ్వరరావు గౌడ్ విమర్శించారు. భద్రాచలం పట్టణంలోని గిరిజన అభ్యుదయ భవనంలో మంగళవారం ఓబీసీ మోర్చా నియోజకవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కుంజా సత్యవతి, నాయకులు శ్రీనివాస గౌడ్, చెరుకూరి సతీష్, నాగబాబు, శ్రీనివాసరెడ్డి, భిక్షపతి, నరసింహారావు, రామ్మోహన్‌రావు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి

ములకలపల్లి: ములకలపల్లి మండల కేంద్రంలో క్రైస్తవులకు కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరుతూ పాస్టర్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ శేషగిరిరావుకు వినతిపత్రం అందజేశారు. ఫెలోషిప్ మండల అధ్యక్షుడు పాస్టర్ మనిష్షే, కార్యదర్శి పాస్టర్ యేసురాజు, కోశాధికారి పాస్టర్ జ్యోతిబాబు, మాజీ అధ్యక్షుడు పాస్టర్ ఏసుదాసు, పాస్టర్ శ్రీనుపాల్ తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శులను రెగ్యులర్ చేయాలి



పంచాయతీ కార్యాలయానికి తాళం వేస్తూ నిరసన తెలుపుతున్న సర్పంచ్, సిబ్బంది

గుండాల: పంచాయతీ కార్యదర్శులు న్యాయపరమైన సమస్యలను పరిష్కరించి వారిని రెగ్యులర్ చేయాలని శంభునిగూడెం సర్పంచ్ ఈసం సుధాకర్ డిమాండ్ చేశారు. మంగళవారం కార్యదర్శులు చేస్తున్న సమ్మెకు నిరసనగా పంచాయతీ కార్యాలయానికి తాళాలు వేసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత నాలుగేళ్లుగా గ్రామాల్లో అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని గుర్తు చేశారు. నేడు వారి సమ్మెతో ఇన్‌చార్జీల పాలన సౌలభ్యంగా లేదని అన్నారు. కార్యదర్శులు చేపట్టిన సమ్మెకు తాము పూర్తి సంఘీభావం తెలుపుతున్నట్లు ప్రకటించారు.

వారపు సంతల్లో వసతులు కల్పించాలి

బూర్గంపాడు: వారపు సంతల్లో వసతుల కల్పనకు ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు కేటాయించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ నాయకుడు పున్నంచంద్ కోరారు. మంగళవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో.. వారపు సంతల్లో కనీస వసతులు లేకపోవటంతో వ్యాపారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఉపాధిహామీ నిధులతో సంతలలో వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు.

పంచాయతీ కార్మికుల ర్యాలీ

దమ్మపేట: మండల కేంద్రంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు వేతనాలు పెంచాలని కోరుతూ మంగళవారం ర్యాలీ నిర్వహించి.. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ.. ప్రస్తుతం ఇస్తున్న రూ.8,500ల వేతనం సరిపోక అనేక ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. కనీస వేతన చట్టం ప్రకారం నెలకు రూ.24,000ల వేతనం ప్రకటించి ఉద్యోగ, ఆరోగ్య భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గొర్రెపాటి బసవయ్య, పెరుమాళ్ల రాంబాబు, సహదేవుడు, సీతయ్య, ధర్మయ్య పాల్గొన్నారు.

బీజేపీ ఎంపీని కఠినంగా శిక్షించాలి

భద్రాచలంఅర్బన్: జాతీయ క్రీడాకారులను లైంగిక వేధించినట్లు ఆరోపణలున్న బీజేపీ ఎంపీని కఠినంగా శిక్షించాలని మహిళా సంఘం భద్రాచలం పట్టణ కార్యదర్శి డి.సీతాలక్ష్మి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం పట్టణంలోని ఏఎంసీ కాలనీలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దేశం తరఫున క్రీడల్లో పాల్గొంటూ దేశానికి పేరు తెస్తున్న క్రీడాకారులను సైతం బీజేపీ వదలటం లేదని విమర్శించారు. ఈ నిరసన కార్యక్రమంలో ఉస్తేల జ్యోతి, బెల్లంకొండ కుసుమ, నాదెళ్ల లీలావతి, సత్యవతి, లక్ష్మి, సుజాత, రమణ, హైమావతి, బుజ్జి, లత, రోజా తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠలో ఎమ్మెల్యే

దమ్మపేట: నూతన రామాలయంలో నిర్మించిన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు పాల్గొన్నారు. మంగళవారం మండల పరిధిలోని తాటిసుబ్బన్నగూడెం గ్రామంలో నిర్వహించిన బొడ్రాయి, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాల సందర్భంగా ఎమ్మెల్యే దంపతులు పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమాన్ని వేద పండితులు కామవరపు విజయమారుతీశర్మ నిర్వహించారు.

ప్రమాదాలకు అడ్డాగా రోడ్డు

- పాడైపోయిన రహదారికి మరమ్మతులు కరువు
- బొగ్గు, ఇసుక లారీలతో ప్రజలు బెంబేలు
- వరుస ప్రమాదాలతో గాల్లో కలుస్తున్న ప్రాణాలు
- పట్టించుకోని అధికారులు



గుంతలు పడిన మణుగూరు-రామానుజవరం మధ్య ప్రధాన రహదారి..



రోడ్డుపై గుంతల మూలంగా పల్టీకొట్టిన బొగ్గు లారీ (ఫైల్)

మణుగూరుటౌన్: మణుగూరు మండలంలోని మణుగూరు-ఏటూరినాగారం ప్రధాన రహదారి మణుగూరు నుంచి రామానుజవరం గ్రామాల మధ్యన పూర్తిగా పాడైపోవడంతో తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. మణుగూరు మీదుగా వరంగల్‌కు ఎక్కువగా రాకపోకలు జరుగుతుంటాయి. వాటికి తోడు మణుగూరు నుంచి బీటీపీఎస్‌కు బొగ్గు రవాణా చేసే లారీలుసైతం ఎక్కువగా తిరుగుతూఉంటాయి. అదే విధంగా గోదావరి తీరం నుంచి ఇసుక రవాణా చేసే ఇసుక లారీలు సైతం నిత్యం వందల సంఖ్యలో తిరుగుతుంటాయి. ఇటువంటి రహదారిలో మణుగూరు నుంచి రామానుజవరం గ్రామాల మధ్య రోడ్డు పూర్తిగా పాడైపోయి గుంతలు ఏర్పడ్డాయి. ఈ గుంతల వల్ల నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి.

ఈ రహదారిలో రోజుకు బీటీపీఎస్‌కు బొగ్గు రవాణా చేసే లారీలు సుమారు 100వరకు తిరుగుతుంటాయి. వాటికి తోడు గోదావరి తీరం నుంచి ఇసుక రవాణా చేసే లారీలు సైతం ప్రతి రోజూ వందల సంఖ్యలో తిరుగుతున్నాయి. ఈ లారీలు ఓవర్‌లోడ్, అతివేగంగా ఎప్పుడు ఎక్కడ ఎవరిని ఢీకొడతాయో అనే విధంగా అత్యంత భయంకరంగా తిరుగుతుంటాయి. రోడ్డు గుంతలు ఉండటంతో వేగంగా వచ్చే వాహనాలు ఒక్కసారిగా పల్టీలు కొట్టిన సంఘటనలు ఉన్నాయి. ఇక ద్విచక్రవాహనదారులైతే ఈ రోడ్డపై వెళ్ళడానికి ప్రాణాలు అరిచేతులో పెట్టుకుని ప్రయాణించాల్సిన దుస్థితి ఉంటుంది.

వరుసగా ప్రమాదాలు..

ఇటీవల జరుగుతున్న వరుస ప్రమాదాలతో ప్రయాణికుల ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. ఇసుక బొగ్గులారీ వేగం తగ్గించాలని ప్రజలు అనేక సార్లు వేడుకున్నా ఎవరూ వాటిని పట్టించుకోవడంలేదు. ఈ నెల రోజుల్లో ఈ రోడ్డుపై జరిగిన ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు మరణించారు. అనేక మంది తీవ్రంగా గాయపడి ఆస్పత్రుల పాలయ్యారు.

ప్రమాద కారణాలివీ..

ప్రధానంగా ఈ రోడ్డు కొంత దూరం వరకు ఒక్కపక్కకే పాడైపోవడం వల్ల వాహనాలు రోడ్డు మంచిగా ఉన్న వైపు వెళ్తుంటాయి. ఆక్రమంలో వాహనాలు ఎదురెదురుగా వచ్చి ఢీకొట్టుకుంటున్నాయి. వాటికి తోడు ఇసుక బొగ్గు లారీలు మితిమీరిన వేగంతో రావడం వల్ల అనేక ప్రమాదాలు జరిగాయి. రోడ్డు అంతా బాగున్నట్లు కనిపించినా తేదో ఒక చోట కనిపించని లోతైన గుంతలు ప్రమాదాలకు దారితీసున్నాయి. అధికారులు ఇటువంటి గుంతలను వెంటనే పూడ్చి ప్రమాదాలు జరగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతులు చేయాలి



మణుగూరు నుంచి రామానుజవరం వరకు ప్రధాన రహదారికి పూర్తిస్థాయిలో రోడ్డుకు మరమ్మతులు చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలి. రోడ్డు ఎక్కువగా పాడైపోయే ప్రాంతాల్లో ప్రత్యేకంగా చర్యలు తీసుకుని నిర్మాణం చేయాలి. దీంతో ప్రమాదాలను అరికట్టవచ్చు.

– బుర్ర సోమేశ్వర్‌గౌడ్, మణుగూరు

ద్విచక్ర వాహనదారులకు భయం



ఈ రోడ్డు మీద మణుగూరు నుంచి సాంబాయిగూడెం ద్విచక్ర వాహనాలపై వెళ్లాలంటే భయంగా ఉంటుంది. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణం చేయాల్సిన దుస్థితి. రోడ్డు కొన్నిప్రాంతాల్లో ఒకే వైపు పాడైపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు ప్రమాదాలకు కారణమవుతున్నాయి.

– భద్రు, ఉపాధ్యాయుడు, సాంబాయిగూడెం

అధికారులు చొరవ తీసుకోవాలి



నిత్యం బీటీపీఎస్, సింగరేణి బొగ్గు లారీలతోపాటు ఇసుక లారీలు సైతం ఈ రోడ్డుపై విపరీతంగా తిరుగుతున్నాయి. అలాంటప్పుడు ఈ రోడ్డుకు ప్రత్యేక మరమ్మతులు చేయించేందుకు ఆ సంస్థలకు చెందిన అధికారులు చొరవ తీసుకోవాలి. తద్వారా ఇక్కడి ప్రమాదాలను నివారించాలి.

– కాటిబోయిన నాగేశ్వరరావు, కాంగ్రెస్ నాయకుడు

పరిశుభ్రత పాటించాలి



పల్లె ప్రకృతివనాలను పరిశీలిస్తున్న డివిజన్ పంచాయతీ అధికారి రాజీవ్‌కుమార్

గుండాల: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ పరిధి గ్రామాల్లో పరిశుభ్రత పాటించాలని కొత్తగూడెం డివిజనల్ పంచాయతీ అధికారి రాజీవ్ కుమార్ అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని కాచనపల్లి, మామకన్ను, ముత్తాపురం, గుండాల పంచాయతీ పరిధిలోని పల్లె ప్రకృతి వనాలతో పాటు, ప్లాంటేషన్, శానిటేషన్ పనులను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిశుభ్రతతోనే రోగాలను నివారించుకోవచ్చునని అన్నారు. ప్రకృతి వనాలలో పిచ్చి మొక్కలను తొలగించాలని, రోడ్లకు ఇరువైపుల నాటిన మొక్కలకు గ్రిల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. అంతర్గత రోడ్లను, మురికి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలన్నారు. ఆయన వెంటన గుండాల సర్పంచ్ కొమరం సీతారాములు, పంచాయతీ సిబ్బంది నాగరాజు, అనీల్ పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

పినపాక: మండలంలోని జానంపేట, దుగ్నేపల్లి, భీమవరం గ్రామాలకు చెందిన మహిళలకు ప్రభుత్వం ద్వారా మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను ఎంపీపీ గుమ్మడి గాంధీ మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పేదింటి ఆడపడుచులు పెళ్లిళ్లకు అప్పులు చేయకుండా తమ బిడ్డలకు మేలు చేసేందుకు పథకం ఉపయోగపడుతుందన్నారు. సొసైటీ చైర్మన్ రవి శేఖర్ వర్మ, ఎంపీటీసీ సత్యం, పినపాక సర్పంచ్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ గాంధీ

వైద్య పరికరాలు అందజేత



పరికరాలకు సంబంధించిన పత్రాలను అందిస్తున్న నవ లిమిటెడ్ ప్రతినిధులు

అన్నపురెడ్డిపల్లి: మండలంలోని ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పాల్వంచ నవలిమిటెడ్ వారు సుమారు రూ.7-8లక్షల విలువ చేసే వైద్య పరికరాలను అందజేశారు. మంగళవారం ఆరోగ్య కేంద్రంలో జిల్లావైద్యాధికారిణి డాక్టర్ శిరీష సమక్షంలో నవలిమిటెడ్ జనరల్ మేనేజర్ సురేష్‌చంద్ర, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ అడ్వైజర్ శ్యాంసుందర్‌లు వైద్య పరికరాలను మండల వైద్యాధికారి డా.ప్రియాంకకు అందించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారిణి ఎల్.శిరీష మాట్లాడుతూ.. నవలిమిటెడ్‌కంపెనీ వారు అందించిన వైద్య పరికరాలు అత్యంత అధునాతనమైన అన్నారు. వీటి వల్ల కార్పొరేట్ వైద్యం చేసే వీలుకలుగుతుందని తెలిపారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సుకృత, వైద్యురాలు తన్మయి, డీపీఎంఓ వెంకటేశ్వరరావు, పీహెచ్ఎన్ పూలమ్మ, హెచ్ఈఓ కృష్ణయ్య, హెచ్‌వీ శారారాణి, కిరణ్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న వీఓఏల నిరసన

భద్రాచలంఅర్బన్: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఐకేపీ వీవోఏలు చేపట్టిన సమ్మె శిబిరాన్ని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా అధ్యక్షుడు మచ్చ వెంకటేశ్వర్లు మంగళవారం ప్రారంభించి మద్దతు తెలిపారు. అనంతరం అంబేడ్కర్ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. సీఐటీయూ పట్టణ కన్వీనర్ ఎంబి.నర్సారెడ్డి, శ్రామిక మహిళా పట్టణ కన్వీనర్ మర్లపాటి రేణుక, సీఐటీయూ పట్టణ కమిటీ సభ్యుడు లక్ష్మణ్ సంతోష్, గిరిజన సంఘం సభ్యులు ప్రవీణ్, వీవోఏలు పాల్గొన్నారు

వంటావార్పును జయప్రదం చేయండి

దుమ్ముగూడెం: ఐకేపీ వీఓఏల సమస్యలను పరిష్కరించాలని వీఓఏల యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో నేడు కలెక్టరేట్ వద్ద నిర్వహించే వంటావార్పు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వీఓఏల జిల్లా ఉపాధ్యక్షుడు గద్దల వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మంగళవారం సమ్మె శిబిరంలో ఆయన మాట్లాడారు. నాయకులు నాగరాజు, దుర్గారాణి, కృష్ణవేణి, భద్రమ్మ, వెంకటనర్సమ్మ, తిరుపతమ్మ, అరుణ, నరేంద్ర, రామకృష్ణ, భాస్కర్, రాజేశ్వరి, రాజేష్, సాయి, వెంకటేష్, కుమారి, అదెమ్మ, లక్ష్మి, వెంకటలక్ష్మి, మణి పాల్గొన్నారు.



మానవహారంగా ఏర్పడిన వీఓఏలు, సంఘాల నాయకులు

యోగా, కంప్యూటర్ ఉచిత శిక్షణ

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణం కూనవరం రోడ్‌లోని శ్రీసరస్వతి శిశు మందిర్ ఆవాస విద్యాలయంలో విద్యార్థులకు ఉచితంగా యోగా, కంప్యూటర్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు పాఠశాల అధ్యక్షుడు పాకాల దుర్గాప్రసాద్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 5 నుంచి 25 వరకు నిర్వహించే ఈ శిక్షణ తరగతులకు 8 నుంచి 14 సంవత్సరాల బాల బాలికలు అర్హులని తెలిపారు. ఆసక్తి గల చిన్నారులు ఈ నెల 4 లోపు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

పూడికతీత ప్రారంభం

అశ్వాపురం: మండల పరిధిలోని ప్రధాన సాగునీటి వనరైన తుమ్మలచెరువు ఆయకట్టు కింద ప్రధాన కాలువైన ఊరవాయి కాలువ పూడిక తీతకు ఉపాధి హామీలో రూ.9.70 లక్షలు మంజూరయ్యాయి. ఉపాధి హామీలో కాలువ పూడికతీత పనులను మంగళవారం మొండికుంట సర్పంచ్ మర్రి మల్లారెడ్డి ప్రారంభించారు. కాలువ కింద యాసంగి లేనందున పనులు చేపట్టారు. పూడిక తీతతో ఉపాధి హామీ కూలీలకు పని కల్పించడంతో పాటు ఆయకట్టు కింద మొండికుంట, మల్లెలమడుగు, రామచంద్రాపురం గ్రామాల రైతుల చివరి పొలాల వరకు నీరు చేరుతుంది.

కొరతను నివారించాలి

గుండాల: స్థానిక జీసీసీ బంక్‌లో డీజిల్, పెట్రోల్ కొరత లేకుండా అధికారులు చూడాలని సర్పంచ్ కోరం సీతారాములు అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. నెల రోజులుగా పెట్రోల్, డీజిల్ కొరతతో రైతులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బడ్జెట్ లేక పెట్రోల్ కొరత ఏర్పడిందని డీఎం చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అధికారులు స్పందించి కొరత లేకుండా తక్షణమే పెట్రోల్, డీజిల్ తెప్పించాలని డిమాండ్ చేశారు.

సంఘం నుంచి బహిష్కరణ

గుండాల: ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు రమణాల లక్ష్మయ్యను సంఘం నుంచి బహిష్కరిస్తున్నట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుంపిడి వెంకటేశ్వర్లు తెలిపారు. గుండాలలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. వ్యక్తిగత నిర్ణయాలు తీసుకోవడమే కాక రాజకీయ లబ్ధికోసం తుడుందెబ్బను విచ్ఛిన్నం చేయడానికి యత్నిస్తుండడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఇక నుంచి తుడుందెబ్బతో లక్ష్మయ్యకు ఎలాంటి సంబంధమూ లేదని ఆయన ప్రకటించారు.

పర్సు అప్పగింత

ములకలపల్లి: ములకలపల్లి పోస్టాఫీస్ బ్రాంచ్ పోస్టమాస్టర్ ఎస్‌బీజీ తిలక్‌కు తాళ్లపాయ రోడ్డువద్ద దొరికిన మనీ పర్సును స్థానిక పోలిస్‌స్టేషన్‌లో అప్పగించారు. పర్సులో రూ.6,800 నగదు, ఆధార్‌కార్డు, పాన్‌కార్డు ఉన్నట్లు తిలక్ తెలిపారు.

ఏరియాలో 125 శాతం ఉత్పత్తి

మణుగూరురూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా ఏప్రిల్ మాసానికి 125శాతం బొగ్గు ఉత్పత్తిని సాధించినట్లు ఏరియా జీఎం దుర్గం రామచందర్ తెలిపారు. మంగళవారం ఏరియా జీఎం కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఉత్పత్తి, ఉత్పాదకతల వివరాలను తెలిపారు. ఏప్రిల్ నెలకుగాను ఏరియాకు నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యం 9.68 లక్షల టన్నులు కాగా.. 12.07లక్షల టన్నులతో 125శాతం ఉత్పత్తిని సాధించామన్నారు. అలాగే ఓబీ వెలికితీత లక్ష్యం 15లక్షల క్యూబిక్ మీటర్లకు గాను 14.90లక్షల క్యూబిక్ మీటర్లతో 99శాతం నమోదం చేయడం జరిగిందన్నారు. ఏప్రిల్ నెలకు రైల్, రోప్‌వే, రోడ్ మార్గం ద్వారా 11.71లక్షల బొగ్గును రవాణా చేయడం జరిగిందన్నారు. సమావేశంలో ఏరియా ఎస్వోటూ జీఎం డి.లలిత్‌కుమార్, ఏజెంట్ కేపీయాజీ నాగేశ్వరరావు, ఏజీఎం సివిల్ వెంకటేశ్వర్లు, ఇంజనీర్ నర్సిరెడ్డి, డీజీఎం (పర్సనల్) ఎస్.రమేష్, మణుగూరుఓసీ పీఓ శ్రీనివాసచారి, డీజీఎం ఐఈడీ వెంకట్రావు, డీవైసీఎంఓ మేరికుమారి, ఫైనాన్స్ మేనేజర్ అనురాధ, సీనియర్ ఎస్టేట్స్ అధికారి బాబుల్ రాజ్, సీనియర్ సెక్యూరిటీ అధికారి షబ్బీరుద్దీన్, సీనియర్ పర్సనల్ అధికారి ఎస్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏరియా జీఎం రామచందర్

పొంగులేటితోనే రాజకీయ భవిష్యత్

అశ్వాపురం: ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డితోనే రాజకీయ భవిష్యత్ అని, ప్రతి ఒక్కరు ఆయనకు అండగా ఉండాలని పినపాక మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్యలు అన్నారు. మండల పరిధిలోని నెల్లిపాకబంజర, రామచంద్రాపురం, మొండికుంట, మల్లెలమడుగు, ఆనందాపురం, సీతరాంపురం, జగ్గారం, గొల్లగూడెం, కల్యాణపురం గ్రామాల్లో మంగళవారం 'పొంగులేటి శ్రీనన్న సైన్యం' ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించారు. గ్రామ కమిటీలు వేశారు. సమావేశాల్లో పాయం, బ్రహ్మయ్య పాల్గొని మాట్లాడగా.. ఎంపీపీ ముత్తినేని సుజాత, నెల్లిపాక పీఏసీఎస్ అధ్యక్షుడు తుక్కాని మధుసూదన్‌రెడ్డి, ఎంపీటీసీ కమటం నరేష్, ఉపసర్పంచ్ అక్కిన శ్రీనివాస్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, బొక్కా సాంబశివరెడ్డి, పులసాని రామిరెడ్డి, చిట్యాల సత్యం, పర్వత నరేష్, రాగం మల్లయ్య, పొడియం అనిల్, బొబ్బాల నాగేశ్వరరావు, మాదినేని రాంబాబు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పాయం, బ్రహ్మయ్య, ఎంపీపీ సుజాత

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

మణుగూరురూరల్: పారిశుద్ధ్య కార్మికులకు మేడే కానుకగా సీఎం కేసీఆర్ నెలకు రూ.వెయ్యి పెంచడాన్ని హర్షిస్తూ.. గళవారం కూనవరం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఆయన చిత్రపటానికి పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఏనిక ప్రసాద్, ఎంపీటీసీ గుడిపూడి కోటేశ్వరరావు, బీఆర్ఎస్ నాయకులు వంక అర్జున్‌రావు, ఏనిక రాంబాబు, పారిశుద్ధ్య కార్మికులు రాములు, అండాలు, నర్సమ్మ, రమణ, నాగేశ్వరరావు, తాతారావు, వెంకన్న, రంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహార సరుకులు పంపిణీ

గుండాల: చేతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో టీఆర్ సత్యనారాయణ జ్ఞాపకార్థం కుటుంబ సభ్యుల సహకారంతో మంగళవారం బాటన్న నగర్ గ్రామంలో పిల్లలకు పోషకాహార సరుకులు పంపిణీ చేశారు. ఫౌండేషన్ అధ్యక్షుడు అనీల్ మాట్లాడుతూ.. ఈ గ్రామంలో పోషకాహార లోపంతో ఉన్న పిల్లలను గుర్తించామని, వారందరికీ 6 నెలల పాటు వచ్చే విధంగా సరుకులు అందించడం జరిగిందన్నారు. చావ పద్మ, సిరివరపు వినయ్‌కుమార్ సహకారంతో పిల్లలకు పాదరక్షలు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో వెనిగళ్ల అనీల్ కుమార్, దొడ్డా సీతామయ్య, భూక్యా సత్తులాల్, చంద్రకాని నవీన్, రషీద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన రహదారిపై తనిఖీలు



మణుగూరులోని ప్రధాన రహదారిపై బ్రిడ్జి వద్ద పరిశీలిస్తున్న పోలీసులు

మణుగూరుటౌన్: మణుగూరు మండల కేంద్రంలోని ప్రధాన రహదారిని పోలీసులు మంగళవారం విస్తృత తనిఖీలు చేపట్టారు. ఇటీవల ఛత్తీస్‌గఢ్ ప్రాంతంలో వరుసగా జరుగుతున్న మావోయిస్టుల దాడుల నేపథ్యంలో సరిహద్దు ప్రాంతాల్లో మణుగూరు పోలీసులు రహదారిలోని ప్రధాన కల్వర్టులు, వాగులు వంకలు, బ్రిడ్జిలను పూర్తిస్థాయిలో తనిఖీలు చేశారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

దమ్మపేట: అకాల వర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్ని వెంటనే ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని ప్రజాపంథా జిల్లా నాయకుడు అమర్లపూడి రాము ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని చిల్లగుంపు గ్రామంలో పార్టీ అనుబంధ సంఘాల సమావేశం నిర్వహించి, కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అమర్లపూడి రాము మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు దుర్గమ్మ, కాకా వెంకటేష్, నాగేష్, సత్యం, వెంకటమ్మ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి వితరణ

మణుగూరురూరల్: మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని శివలింగాపురం గ్రామానికి చెందిన జినుగు సంపత్‌కుమార్ ఇటీవల అనారోగ్యంతో మరణించగా.. మణుగూరు మున్నూరుకాపు సంఘం వారు ఇచ్చిన హామీ మేరకు మృతుడి కుటుంబానికి మంగళవారం క్వింటా బియ్యంతో పాటు రూ.10 వేలను వితరణగా అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణమోహన్, గాండ్ల సురేష్, సభ్యులు వలసాల వెంకటరామారావు, ఎడవల్లి వెంకటయ్య, కుర్రి నాగేశ్వరరావు, సత్యనారాయణ, ప్రజాప్రతినిధులు, యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

మణుగూరురూరల్: మండలంలోని సమితిసింగారం గ్రామపంచాయతీ అశోక్‌నగర్ ప్రాంతానికి చెందిన తోటలక్ష్మి అనే ఒంటరి మహిళ అనారోగ్యంతో బాధపడుతూ వైద్యఖర్చులకు ఆర్థికంగా ఇబ్బంది పడుతుండగా.. మణుగూరులోని జనంకోసం మనం స్వచ్ఛంద సంస్థ సభ్యులు మంగళవారం బాధితురాలిని పరామర్శించారు. మండవ రమేష్-సంధ్య దంపతులు అందించిన రూ.10వేలను ఆర్థిక సహాయంగా అందజేశారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకుడు గూడూరు కృష్ణారెడ్డి, సభ్యులు నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

మణుగూరురూరల్: ఈ నెల 4వ తేదీన జిల్లాలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగే యువజన విభాగ సమావేశాన్ని జయప్రదం చేయాలని బీఆర్ఎస్ యువజన విభాగ నియోజకవర్గ అధ్యక్షుడు మట్టపల్లి పిలుపునిచ్చారు. 4వ తేదీ ఉదయం 9గంటలకు సమావేశం ప్రారంభం అవుతుందని తెలిపారు.

వీడని వర్షం.. ఆగని నష్టం

ములకలపల్లి: ములకలపల్లిలో మంగళవారం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం సుమారు గంటసేపు కురిసిన వానకు కల్లాలో వడ్లు తడిసిపోయాయి. ఆరబెట్టిన ధాన్యం రాశులు వరద ప్రవాహానికి కొట్టుకుపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. పట్టాలు కప్పి పంటను కాపాడుకునే ప్రయత్నాలు చేశారు.

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేట మండల వ్యాప్తంగా మంగళవారం సాయంత్రం జోరు వర్షం కురిసింది. దీంతో అశ్వారావుపేట, పేరాయిగూడెం పంచాయతీల్లోని మురుగు కాల్వలు పొంగిపోర్లగా, ప్రధాన వీధుల్లో వరదనీరు చేరింది. అలాగే ఎడతెరిపిలేకుండా కురిసిన ఆకాల వర్షంతో మామిడి, వేరు శెనగ, జీడిమామిడి తోటల రైతుల్లో ఆందోళన నెలకొంది. రెండో రోజు కూడా జోరు వానతో ధాన్యం కుప్పల వద్ద వరదనీరు నిలిచిపోగా.. రైతులు లబోదిబోమంటున్నారు. వరిలో తేమ శాతం దెబ్బతినే అవకాశం ఉందని, దాంతో గిట్టుబాటు ధర దక్కదని రైతులు వాపోతున్నారు.

గుండాల: గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని పంటలు తడిసిపోతుండడంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. గుండాల, ఆళ్లపల్లి మండలాల్లో ఈ యాసంగిలో ఎక్కువ శాతం మిర్చి, మొక్కజొన్న పంటలు సాగు చేశారు. కాగా పంట చేతికొచ్చే సమయంలో గత నెలలో కురిసిన భారీ వర్షాలకు చేలన్నీ నేలమట్టమయ్యాయి. ఇటీవల కోసిన మొక్కజొన్న, మిర్చి కల్లాల్లో ఆరబోశారు. పంట పూర్తి స్థాయిలో ఎండకముందే గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు తడిసిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరబోసిన పంటలపై టార్పాలిన్లు కప్పినప్పటికీ ఈదురుగాలలకు లేచిపోతున్నాయని వాపోతున్నారు. ఇక విరిసిన మొక్కజొన్న చేన్లలోనే మొలకలు వస్తున్నాయి. అధికారులు సర్వే నిర్వహించి తమను ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.



ములకలపల్లి: ధాన్యం కల్లంలో వరద ప్రవాహం